క్లుప్తంగా

విద్యార్థులకు ప్రశంసా పత్రాల అందజేత



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

హవేళీఘణాపూర్(మెదక్): విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే విధంగా మాచి రాజు సాహిత్య పీఠం చేస్తున్న కృషి మరువలేనిదని హవేళీఘణాపూర్ జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు ఉండ్రాళ్ల రాజేశం, అశోక్, ఎల్లమ్మలు అభినందించారు. బాలలు నీతి, సాహిత్యంపై ఆసక్తితో రాసి గెలుపొందగా వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని సాహితీ కథనాలు రాసి మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు.

మట్టి తరలింపునకు అనుమతి ఇవ్వండి

ఆర్డీఓకు కాంగ్రెస్ నేతల వినతి



ఆర్డీఓ రమాదేవికి వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేతలు

చిన్నశంకరంపేట(మెదక్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అవసరమైన మట్టి తరలింపు కోసం అనుమతి ఇవ్వాలని మెదక్ ఆర్డీఓ రమాదేవిని కాంగ్రెస్ నాయకులు కోరారు. మాజీ సర్పంచ్ రాజిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పునాదుల నిర్మాణం పూర్తి చేసి మట్టి తరలింపు కోసం వేచి చూస్తున్నారని తెలిపారు. అధికారులు మట్టి తరలింపుకు అనుమతి ఇవ్వాలని కోరారు.అవసరమైన చర్యలు తీసుకుంటానని ఆర్డీఓ హామీ ఇచ్చారు.

సాంకేతికతను వినియోగించుకోవాలి



నానో యూరియా కలిపి డ్రోన్‌తో స్ప్రే చేస్తున్న రైతు

హవేళీఘణాపూర్(మెదక్): రైతులు పొలాలకు స్ప్రే చేయడం లాంటి సమయాల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని ఏవో బాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని వాడి గ్రామంలో నానో కంపెనీ యూరియాతో వరిపొలానికి డ్రోన్‌తో స్ప్రే చేశారు. అనంతరం ఏవో మాట్లాడుతూ రైతులు డ్రోన్ వాడడం ద్వారా సమయం వృథా కాకుండా త్వరగా సులభంగా స్ప్రే చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈవో స్వాతి, రాఖేశ్, మల్లారెడ్డి, కిషన్, విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

నర్సాపూర్: రాక్ క్లైమ్బింగ్‌లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినారని స్థానిక అల్లూరి సీతారామరాజు గిరిజన బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణకిషోర్ తెలిపారు. భువనగిరిలో రాష్ట్ర స్థాయి రాక్ క్లైమ్బింగ్ శిక్షణలో తమ పాఠశాలలోని 8వ తరగతికి చెందిన రాజేష్, 9వ తరగతికి చెందిన నరేష్, శ్రీకాంత్ శిక్షణలో పాల్గొని ఏ గ్రేడ్ సర్టిఫికెట్ సాధించారని ఆయన వివరించారు. శిక్షణలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు బస్వరాజ్, లింగంగౌడ్, రాజులు అభినందించారు.

సన్మానం



కార్మికులను సన్మానిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

రామాయంపేట(మెదక్): సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సేవా సమితి సభ్యులు శనివారం మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లిలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. సేవా సమితి జిల్లా కన్వీనర్ యాచం శంకరయ్య ఆధ్వర్యంలో కార్మికులను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈసందర్భంగా వారు కార్మికుల సేవలను కొనియాడారు. అంతకు ముందు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. మండల విద్యాధికారి శ్రీనివాస్, సమితి ఇన్‌చార్జి వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.

ఒక్కో మొక్కకు మూడేసి కంకులే..!

- కొంపముంచిన కావేరి విత్తనాలు
- దిగుబడి ఉండదంటున్న మొక్కజొన్న రైతులు



మక్కరాజీపేటలో రైతులు వేసుకున్న మొక్కజొన్న పంటలు

చేగుంట(తూప్రాన్): మండలంలోని మక్కరాజీపేటలో రైతులు వేసుకున్న మొక్కజొన్న పంటలు దిగుబడి రాక రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. మక్కరాజీపేట గ్రామానికి చెందిన సుమారు 15 మంది రైతులు స్థానిక విత్తనాల షాపులో కావేరీ ఎక్కా 2,288 రకం మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేసి పంట విత్తుకున్నారు. ప్రస్తుతం కంకులు వేసే దశదాటిపోగా ప్రతి మొక్కకు రెండుకంటే ఎక్కువ మొక్కజొన్న కంకులు వేశాయి. మొక్కలకు ఒక్క కంకి ఉంటేనే దానిలో మొక్కజొన్నలు విరివిగా ఉంటాయి. అదే ఒక్క మొక్కకు రెండు కంటే ఎక్కువ కంకులు వేస్తే అందులో కనీసం



మక్కరాజీపేటలో మూడేసి కంకులు వేసిన మొక్కజొన్నపంట

10శాతం మాత్రమే గింజలు వస్తాయని రైతులు వాపోతున్నారు. ఆరుతడి పంటగా మొక్కజొన్న పంటలు వేసుకుంటే త్వరలో కోతకొచ్చి కొంత డబ్బు వస్తుందనుకున్న రైతులకు తక్కువ దిగిబడి దిగులు వెంటాడుతుంది. ఇటీవల వ్యవసాయ అధికారులకు రైతులు పిర్యాదు చేయగా వ్యవసాయ అధికారి హరిప్రసాద్ పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు విత్తన పరిశ్రమ నిర్వాహకులకు నివేదికను పంపించారు. నాణ్యమైన విత్తనాలని పంట వేసుకుంటే తాము నష్టపోయే పరిస్థితి నెలకొందని తమకు విత్తన కంపెనీ నుండి పరిహారం ఇప్పించాలని బాధిత రైతులు వాపోతున్నారు.

> **నివేదికను పంపించా**
>
> 
>
> మక్కరాజీపేటలోలో మొక్కజొన్న పంటలకు ఒక్కో మొక్కకు మూడు కంకులు వేసిన విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపాం. ఉన్నతాధికారులకు నివేదికను పంపించడం జరిగింది. పంటల పరిశోధనకు సంబంధించిన సైంటిస్టుల పరిశీలకు పంపించాం. ఉన్నత అధికారుల ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటాం.
>
> – హరిప్రసాద్, వ్యవసాయ అధికారి

‘ఉపాధి’లో అవకతవకలు

సామాజిక తనిఖీలో వెలుగులోకి



ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న అధికారులు

అల్లాదుర్గం(మెదక్): ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయి. చనిపోయిన వ్యక్తి పేరుపై రికార్డులు సృష్టించి కూలి డబ్బులు మంజూరు చేశారు. ఈ మేరకు వారం రోజులుగా మండలంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో అక్రమాలను బయటపెట్టారు. 2024– 25 సంవత్సరానికి గాను మండలంలో సుమారు రూ. 6.95 కోట్ల పనులు ఉపాధి హామీ పథకం కింద చేపట్టారు. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్, టీఏల అక్రమాలు బయటపడ్డాయి. పశువుల పాకల నిర్మాణంలో అవకతవకలు జరిగినట్లు తేలింది. మస్టర్ల నిర్వహణ, రికార్డులు అస్తవ్యస్తంగా ఉండటం, పనులు నిర్వహించిన చోట బోర్డులు ఏర్పాటు చేయకుండా నిధులు స్వాహా చేసినట్లు సామాజిక తనిఖీ బృందం బయటపెట్టింది. అక్రమాలకు పాల్పడిన వారి నుంచి రూ. 62,987 రికవరీకి ఆదేశించినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ తెలిపారు. రూ. 19 వేలు జరిమానా వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి శ్రీహరి, హెచ్‌ఆర్ రాజేందర్ రెడ్డి, ఎస్‌ఆర్‌పీ నాగరాజు, అంజనేయులుగౌడ్, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణానికి అనుకూలంగా పంటలు

రైతులకు వ్యవసాయ విద్యార్థుల సూచన



వాతావరణ పరిస్థితులు వివరిస్తున్న విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): వాతావరణానికి అనుకూలంగా పంటలు సాగు చేయాలని మల్లారెడ్డి యూనివర్శిటీ వ్యవసాయ విద్యార్థులు అన్నారు. శనివారం వారు కేవీకే శాస్త్రవేత్త డా, రవికుమార్ ఆధ్వర్యంలో చిలప్‌చెడ్ మండలం శీలాంపల్లిలో గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా వరిలో నీటి నిల్వ ఉంచకూడదన్నారు. అదేవిధంగా సుడిదోమ, అగ్గితెగులు నివారణకు, కలుపు లేకుండా చూడాలన్నారు. ప్రతి రెండు మీటర్లకు కాలిబాట తీయడం వల్ల గాలి ప్రసరణ పెరిగి, చీడపీడల ఉధృతి తగ్గుతుందన్నారు. ప్రస్తుతం పత్తి, కాయ అభివృద్ధి దశలో ఉందని, అధిక వర్షాల వల్ల వడలు, తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. నిల్వ నీరు తొలగించపోతే మొక్కలు బలహీనపడుతాయని, వ్యాధి సోకిన మొక్కల వద్ద కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు, లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు లతాశ్రీ, దేవిక, చందన, అక్షయ. అశ్వని, భావన, భవాని, శేశ్విక పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు



కొడిపల్లి: అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులు పంటపొలాలకు పురుగుల మందులు స్ప్రే చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని మల్లారెడ్డి వ్యవసాయ యూనివర్సిటీ విద్యార్థులు రైతులకు సూచించారు. రావే (రూరల్ అగ్రికల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్)లో భాగంగా మండలంలోని తునికి కేవీకేకు విద్యార్థులు వచ్చారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ పర్యవేక్షణలో శనివారం మండలంలోని తునికిలో రైతులకు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ రైతులు ప్రతి రోజు పంటలను పరిశీలించాలని పేర్కొన్నారు. మోతాదుకు మించి ఎరువులు వాడవద్దని చెప్పారు. పంటలకు చీడపీడలు సోకినట్లయితే వ్యవసాయ అధికారులు సూచనల మేరకు క్రిమిసంహారక మందులు వాడాలన్నారు. పురుగుల మందులు వాడేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వైష్ణవి, హరిప్రియ, గాయని, ఝాన్సి, పాల్గొన్నారు.

బగలాముఖీలో మహామంత్ర హోమం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో అమావాస్య సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. బగలాముఖీ ఉపాసకులు, వేద పండితుడు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహామంత్ర హవనము, హరిద్వార్చన, ప్రత్యేక పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కాగా, మండల పరిధి గూడూర్‌లోని శ్రీ గురుపీఠంలో కొలువైన దత్తాత్రేయ, సాయిబాబా ఆలయాల్లో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు.

దాతల సహాయం సద్వినియోగం చేసుకోండి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహాయం సద్వినియోగం చేసుకోవాలని తిమ్మాపూర్ పీఎస్ పాఠశాల హెచ్‌ఎం అభిలాష్ అన్నారు. శనివారం పాఠశాల విద్యార్థులకు అక్షయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగులు, నోట్ బుక్స్, స్టేషనరీ సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సురేష్‌యాదవ్, మహేష్, పవన్, ప్రవీణ్, నిఖిల్, సంపత్, వినయ్, తదితరులు ఉన్నారు.



బ్యాగులు, స్టేషనరీ సామగ్రితో విద్యార్థులు

నానోతో అధిక ప్రయోజనాలు

ఏఓ నాగమాధురి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాపన్నపేట(మెదక్): నానో యూరియాతో అధిక ప్రయోజనాలు ఉంటాయని పాపన్నపేట వ్యవసాయ అధికారి నాగమాధురి సూచించారు. శనివారం మండల పరిధిలోని అన్నారం గ్రామానికి చెందిన బండారు ప్రభాకర్ పొలంలో నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ.. నానో యూరియా వాడకం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు పొంద వచ్చన్నారు. సాంప్రదాయ గుళికల రూపంలో ఉండే యూరియా వాడితే ఎక్కువ ఖర్చు అవుతుందని చెప్పారు. రూ.225తో దొరికే 500 మి.లీ నానో యూరియా ఎకరాకు సరిపోతుందన్నారు. నానో యూరియాతో పర్యావరణానికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు జనార్దన్, రజిత, జనార్ధన్, రైతులు గఫార్, శంకర్, ఇమానియల్, సంతోష్, యాదగిరి, రాజు, ఇస్మాయిల్, మల్లేశం పాల్గొన్నారు.

యూరియా కోసం తప్పని తిప్పలు



పెద్దశంకరంపేటలో రైతుల బారులు



నర్సాపూర్ సొసైటీ వద్ద నిరీక్షిస్తున్న రైతులు

పెద్దశంకరంపేట(మెదక్)/నర్సాపూర్: యూరియా కోసం రైతులు బారులు తీరారు. శనివారం స్థానిక ఫర్టిలైజర్ దుకాణంలో పోలీసు పహారా మధ్య యూరియా బస్తాలను అందజేశారు. రైతులు ఆందోళన చెందవద్దని యూరియాను అవసరమైన మేరకు పంపిణీ చేస్తున్నట్లు ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి కృష్ణ తెలిపారు. రైతులు నానో యూరియాపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్‌లో యూరియా కోసం రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. శనివారం ఉదయం ఆయా గ్రామాల రైతులు వచ్చి స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్దకు యూరియా కోసం వచ్చారు. యూరియా సాయంత్రం వస్తుందని సిబ్బంది చెప్పి వారి నుంచి ఆధార్ కార్డుల జిరాక్స్‌లు తీసుకున్నారు. సాయంత్రం యూరియా రావడంతో అప్పటి వరకు రైతులు సొసైటీ భవనంతో పాటు ఎదురుగా ఉన్న చెట్ల కింద నిరీక్షించారు. కాగా మండల వ్యవసాయాధికారి దీపిక మాట్లాడుతూ 450 బస్తాల యూరియా వచ్చిందని, రైతులకు పంపిణీ చేసినట్లు చెప్పారు.

ముగ్గురిపై కేసు నమోదు

కౌడిపల్లి(నర్సాపూర్): పోలీసుల విధులకు ఆటకం కలిగించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం రాత్రి మండలంలోని వెంకట్రావుపేట గేట్ సమీపంలోని తన పొలంలో ముగ్గురు అనుమానాస్పదంగా తిరుగుతూ పొలంలో ఉన్న కడీలు ధ్వంసం చేశారని వేణుగోపాల్ ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీంతో ఏఎస్‌ఐ నరసింహమూర్తి, హోంగార్డు లింగేష్ పోలీస్ పెట్రోలింగ్ వాహనంలో అక్కడికి విచారణకు వెళ్లగా.. వెంకట్రావ్‌పేటకు చెందిన దొంతుల ఆంజనేయులు, శ్రీనివాస్‌తో పాటు మరోవ్యక్తి పోలీసులను ఇక్కడికి ఎందుకు వచ్చారంటూ విధులకు ఆటకం కలిగించడంతో పాటు అసభ్యంగా మాట్లాడారని పేర్కొన్నారు. దీంతో ఏఎస్‌ఐ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలాఉండగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి మండలం బొప్పాపూర్‌కు చెందిన వేణుగోపాల్‌కు వెంకట్రావ్‌పేట గేట్ సమీపంలోని వ్యవసాయ భూమి ఉంది. కాగా భూమిలో శనివారం కడీలను ధ్వంసం చేయడంతో పాటు అక్కడ పనులు చేస్తున్న కూలీలపై దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

నర్సాపూర్: వినాయక చవితిని పురస్కరించుకొని నవరాత్రులను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ సూచించారు. శనివారం ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన నర్సాపూర్, చిలప్‌చెడ్ మండలాలకు చెందిన గణపతి మండపాల నిర్వాహకులు, పీస్ కమిటీ ప్రతినిధుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గణపతి మండపాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. డీజే నిషేధించినందున వినియోగించవద్దని ఆయన చెప్పారు. సమావేశంలో సీఐ జాన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్‌ఐ లింగం, మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

నర్సాపూర్ కోర్టు జడ్జి హేమలత



మాట్లాడుతున్న జడ్జి హేమలత

కౌడిపల్లి(నర్సాపూర్): వృద్ధులు, తల్లిదండ్రులపై కన్న పిల్లలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని నర్సాపూర్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి హేమలత హెచ్చరించారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని తునికి వద్ద గల రామానాయుడు వృద్ధాశ్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. తల్లిదండ్రులను పోషించాల్సిన బాధ్యత పిల్లలదేనని అన్నారు. తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తులను కొందరు పిల్లలు తమ పేరున రాయించుకొని వారి బాగోగులు చూ డడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, ఆర్‌ఐ శ్రీహరి, డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, వలంటీర్ జగదీష్, లీగల్ సర్వీసెస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పీజీ హెచ్‌ఎంగా మధుసూదన్‌రావు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీజీ హెచ్‌ఎంగా శనివారం మధుసూదన్‌రావు బాధ్యతలు స్వీకరించారు. రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మధుసూదన్‌రావు ప్రమోషన్‌లో భాగంగా ఇక్కడికి వచ్చారు.

◆ ఓపెన్ స్కూల్ ఒక వరం

పాపన్నపేట(మెదక్): చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఒక వరమని ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లు రెగ్యులర్ వాటితో సమానమన్నారు. ఈనెల 31వ తేదీ వరకు అడ్మిషన్ తీసుకోవడానికి గడువు ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేశ్వర్, నాగరాజు, రియాజ్, రమేష్, విశ్వనాథం, సుభాష్, మహమ్మద్ ఉన్నారు.

◆ రూ.35 కోట్లు మంజూరు చేయండి

పాపన్నపేట(మెదక్): మెదక్ నియోజక వర్గంలో సీసీరోడ్లు, సైడ్ వాల్స్ కోసం రూ.35 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి తెలిపారు. మెదక్ మున్సిపాలిటీకి రూ.10 కోట్లు, రామాయంపేటకు రూ.5 కోట్లు, పాపన్నపేటకు రూ.5 కోట్లు, హవేళీఘనపూర్‌కు రూ.5 కోట్లు,నిజాంపేటకు రూ.5 కోట్లు, చిన్నశంకరంపేటకు రూ.5 కోట్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

◆ అభివృద్ధిపై దృష్టి సారించాలి

కొల్చారం(నర్సాపూర్): మండలంలో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పనుల జాతరలో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీఓ యాదయ్య సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమం ఏపీఓ కృష్ణవేణి పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన

ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ తెలంగాణా ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు.



చిలప్‌చెడ్‌లో..



పెద్దశంకరంపేట: నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



కొల్చారంలో..



వెల్దుర్తి: మాసాయిపేటలో..



నార్సింగి పాఠశాలలో..



చేగుంటలో..



పాపన్నపేటలో..

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264